

పీఆర్సీ ప్రకటించాలి

పీఆర్సీని వెంటనే అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందగౌడ్ డిమాండ్ చేశారు. 10లో▸



విద్యతోనే ఫలితాలు

వినోదంతో కూడిన విద్యతోనే మెరుగైన ఫలితాలు వస్తాయని సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కరీం అన్నారు. 10లో▸



మెనూ ప్రకారం భోజనం

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తహసీల్దార్ తారాసింగ్, ఎంపీడీఓ విశ్వప్రసాద్ ఆదేశించారు. 11లో▸

న్యూస్‌రీల్

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు: ఏబీవీపీ



ఏబీవీపీ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

పరిగి: విద్యార్థుల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గణేశ్ ఆరోపించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలో నిరసన కార్యక్రమానికి పిలుపునివ్వడంతో పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడవక ముందే 51 మంది విద్యార్థులు చనిపోయినా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. విద్యార్థుల పక్షాన తాము పోరాటం చేస్తుంటే అరెస్టులు చేయడం ఎంత వరకు సమంజసమని అన్నారు. అరెస్టులతో విద్యార్థుల ఉద్యమాన్ని ఆపలేరన్నారు. విద్యాశాఖ మంత్రికి ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తూ విద్యార్థుల ప్రాణాలను బలితీసుకుంటోందన్నారు. విద్యాశాఖలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నా ఎవ్వరూ పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

నేటితో ముగియనున్న రుద్రాభిషేకం

అనంతగిరి: ఆధ్యాత్మిక సేవా మండలి ఆధ్వర్యంలో నెల రోజుల పాటు వికారాబాద్‌లో కొనసాగుతున్న రుద్రాభిషేక మహోత్సవం నేటి(ఆదివారం)తో ముగియనుంది. పట్టణంలోని రామమందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. తెల్లవారుజామున 5.30గంటలకు ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తనతోపాటు 6.30గంటలకు గోపూజ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. 8గంటలకు మహా గణపతి పూజ, మహన్యాస, లఘున్యాస పూర్వక లఘు రుద్రాభిషేకం, 12గంటలకు పార్వతి పరమేశ్వరుల శాంతి కల్యాణం చేస్తారు. ఒంటి గంటకు జరిగే ఆధ్యాత్మిక ప్రవచనంలో ముఖ్యఅతిథిగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త భాస్కరయోగి హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2గంటలకు మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందన్నారు. సాయంత్రం 5.30గంటలకు స్వామి వారి పల్లకీ సేవ ఉటుందని భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. శనివారం వికారాబాద్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన రుద్రాభిషేకంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన జిల్లా నాయకులు



కిషన్‌రెడ్డికి మొక్కను బహూకరిస్తున్న మాధవరెడ్డి తదితరులు

అనంతగిరి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్‌ను పార్టీ జిల్లా నాయకులు శనివారం నగరంలో కలిశారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కిషన్‌రెడ్డి సూచించినట్లు జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్లనందు తెలిపారు.

విజయోత్సవాలకు ముస్తాబు



తాండూరు టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది ప్రజాపాలన పూర్తవుతున్న నేపథ్యంలో విజయోత్సవాలకు సిద్ధమైంది. ఇందులో భాగంగా తాండూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. విద్యుద్దీపాల వెలుగులో మిరుమిట్లు గొలిపింది.

ఆయిల్‌పామ్ పండించే రైతులకు ప్రోత్సాహకాలు

మహేశ్వరం: ఆయిల్‌పామ్ పండించే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్ పేర్కొన్నారు. కందుకూరులోని రైతు వేదికలో శనివారం మల్బరీ, ఆయిల్‌పామ్ పంటల సాగు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.

హస్తవాసికే పరిహారం!

రైతుల ఖాతాల్లో పంట నష్టపరిహారం జమ

- కాంగ్రెస్ సానుభూతిపరులకే లబ్ధి
- ఈ ఏడాది 1,500 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- 2020 నుంచి 22 వరకు వేల ఎకరాల్లో పాడైన పంటలు
- గతేడాది 3,399 ఎకరాల్లో..
- ఒక్క ఏడాదికే పరిహారం చెల్లింపుపై ఆందోళనలో రైతులు



మోమిన్‌పేట్‌లో వడగళ్ల వానతో దెబ్బతిన్న పంట(ఫైల్)

వికారాబాద్: పంట నష్టపరిహారం ఎట్టకేలకు రైతుల ఖాతాల్లో జమ అయ్యింది. నాలుగేళ్లుగా పంటలు దెబ్బతింటున్నా ఈ ఒక్క ఏడాదికి సంబంధించిన పరిహారాన్నే ప్రభుత్వం చెల్లించింది. ప్రస్తుత సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 1,350 మంది రైతులు 1,500 ఎకరాల్లో పంటలు నష్టపోయారు. ఇందుకుగాను ప్రభుత్వం రూ.1.51 కోట్లు విడుదల చేసింది. వారం రోజుల నుంచి రైతుల ఖాతాల్లో పరిహారం డబ్బు జమ చేస్తున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ సానుభూతి పరులకే పంట నష్టం అందుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. లక్షల్లో పెట్టుబడులు పెట్టి ఎండనకా వాననకా కష్టపడి పండించిన పంటలు చేతికొచ్చే సమయంలో వర్షార్పణమవుతున్నాయి. ఐదేళ్లుగా ఇదే పరిస్థితితో రైతులు నష్టపోతున్నారు. నష్టపోయిన సమయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు హడావుడి చేసి ఆ తర్వాత పట్టించుకోవడం లేదని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాదిలో కురిసిన భారీ వర్షాలకు వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. స్పీకర్, ఎమ్మెల్యేలు గ్రామాల్లో పర్యటించి అన్నివిధాలా ఆదుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. ప్రతిపక్షాలు, రైతు సంఘాల నాయకులు ఎకరాకు రూ.25 వేల చొప్పున సాయం అందివ్వాలని డిమాండ్ చేశారు.

జాబితా తయారీపై విమర్శలు

పంట నష్టపరిహారం కేటాయింపునకు సంబంధించి రైతుల జాబితా తయారీపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో వందల సంఖ్యలో రైతులు పంటలు నష్టపోయారు. అయితే కాంగ్రెస్ నేతలు ఇచ్చిన జాబితానే అధికారులు ప్రభుత్వానికి పంపారని, అందుకే ఆ పార్టీ సానుభూతిపరులు, నాయకులకే పరిహారం వచ్చిందని బాధిత రైతులు అంటున్నారు. పరిగి మండలం మాదారం గ్రామంలో 150 మందికి పైగా రైతులు పంటలు నష్టపోగా కేవలం 86 మందికే పరిహారం వచ్చింది. లబ్ధి పొందిన రైతులందరూ కాంగ్రెస్ సానుభూతిపరులేనని పలువురు ఆరోపిస్తున్నారు.

నాలుగేళ్లుగా నష్టాల్లో రైతన్న

2020లో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించిన సర్వే ప్రకారం 4.5లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయగా 1.25 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగిందని తేలింది. 2021లో ఇదే తరహాలో భారీ వర్షాలకు 25వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఇందుకు సంబంధించిన నివేదికను అధికారులు ప్రభుత్వానికి పంపారు. 2022లో కూడా 6వేల ఎకరాల్లో పంటలు పాడయ్యాయి. 2023లో 3,399 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగింది. అయితే ప్రస్తుత సీజన్‌లో దెబ్బతిన్న 1,500 ఎకరాలకు మాత్రమే ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. గడిచిన నాలుగేళ్ల పరిహారం అందలేదు.

నష్టపరిహారం రాలేదు



భారీ వర్షాల కారణంగా మూడేళ్ల పాటు పంటలు నష్టపోయాం. పెట్టుబడి కూడా రాలేదు. ఈ ఏడాది అప్పులు తెచ్చి పంటలు సాగు చేశాం. భారీ వర్షాలకు వరి పంటలు పూర్తిగా మునిగిపోయాయి. అధికారులు నష్టం వివరాలు సేకరించారు. కానీ పరిహారం మంజూరు కాలేదు. సాగు భారంగా మారింది.

– జంగయ్య, రైతు, బొంపల్లి



అనంతగిరి: జయశంకర్‌ను సన్మానిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

అంకితభావంతో పని చేయాలి

ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: విధి నిర్వహణలో పోలీసులు అంకితభావంతో పని చేయాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. ఇటీవల పాసింగ్ ఔట్ పరేడ్ పూర్తి చేసుకొని జిల్లాలో రిపోర్ట్ చేసి, విధుల్లో చేరే నూతన పోలీస్ కానిస్టేబుళ్లతో శనివారం ఎస్పీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణ, సమయపాలన పాటించాలన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చిందని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు ఎవరు వచ్చినా మంచిగా మాట్లాడి సమస్య తెలుసుకోవాలన్నారు. ప్రజలతో స్నేహంగా మెలగాలని తెలిపారు. జిల్లాకు 97మంది రిపోర్ట్ చేసి విధుల్లో చేరారని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఏవో జోతిర్మని, ఏఆర్ డీఎస్పీ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి

విధి నిర్వహణలో ప్రజలకు మనం చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్‌లోని ఎస్పీ కార్యాలయంలో ఎస్‌ఐ జయశంకర్ ఉద్యోగ విరమణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు.



తాండూరు: మాట్లాడుతున్న ఎస్పీ

పట్టణ పోలీసుల పనితీరు భేష్

తాండూరు: అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో నిఘా పెంచి నేరాల నియంత్రించామని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శనివారం తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. కేసుల రికార్డులను పరిశీలించారు. ఇసుక అక్రమ రవాణా, పేకాట, నేరాలను నియంత్రించడంలో చొరవ చూపిన డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, పట్టణ సీఐ సంతోష్‌ను అభినందించారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌కు 97 మంది కానిస్టేబుళ్లు రావడం జరిగిందన్నారు. అందులో 66 ఎఆర్ విభాగం, కమ్యూనికేషన్ సిబ్బంది వచ్చారన్నారు. ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలని ఆదేశించారు. లగచర్ల ఘటనపై విచారణ సాగుతోందన్నారు. కార్యక్రమంలో సీఐ సంతోష్, ఎస్సైలు విఠల్‌రెడ్డి, భరత్‌రెడ్డి పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్ కోసం ఇటీవల స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు సన్నాహాలు

- గతంలోనే స్థల పరిశీలన చేసిన అధికారులు
- ఇటీవల ఎస్పీ సైతం..
- త్వరగా అందుబాటులోకి తెచ్చే ఆలోచనలో ప్రభుత్వం

దుద్యాల్: మండలంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. లగచర్ల, పోలేపల్లి ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఇక్కడ ఎలాంగి గొడవలు, ఆందోళనను తలెత్తకుండా చూసుకునేందుకు గాను పోలీస్‌స్టేషన్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది. మండలంలో ఫార్మా కంపెనీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం.. ఆ వెంటనే హకీంపేట్, పోలేపల్లి, లగచర్ల, రోటిబండ తండా, పులిచర్లకుంట తండా రైతులు ఆందోళన చేపట్టడం జరిగిన విషయం తెలిసిందే. ఈ నెల 11న లగచర్లలో అధికారులపై జరిగిన దాడుల తర్వాత ఈ ప్రాంతానికి పోలీసుల రక్షణ అవసరం అని భావించిన ప్రభుత్వం రెండు రోజుల క్రితం పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేసింది. మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని భావించింది. రెవెన్యూ, కడా ప్రత్యేక అధికారి మండలంలోని వివిధ ప్రాంతాల్లో స్థల పరిశీలన చేశారు. వారం రోజుల క్రితం ఎస్పీ నారాయణ రెడ్డి దుద్యాల్ గేట్ సమీపం వద్ద గల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. అదే స్థలాన్ని గతంలో తహసీల్దార్ వెంకటేశ్ ప్రసాద్, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి కూడా పరిశీలించారు. ఆ స్థలం జాతీయ రహదారికి అనుకొని ఉండటంతో పోలీస్ స్టేషన్ నిర్మాణానికి అనుకూలంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు భావిస్తున్నారు.

రూ.10 వేల కోట్లతో ధాన్యం కొనుగోలు



మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్



ఏఎంసీ నూతన పాలకవర్గంతో ప్రమాణం చేయిస్తున్న అధికారులు

- 67 లక్షల ఎకరాల్లో 1.53లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది
- ఈ ఏడాది రైతు సంక్షేమానికి సీఎం రూ.54 వేల కోట్లు ఖర్చు చేశారు
- ధారూరు ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్

ధారూరు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపడంతో రాష్ట్రంలో రైతులు 67 లక్షల ఎకరాల్లో 153 లక్షల మెట్రిక్ టన్నుల వరిని పండించారని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం ధారూరు ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఒకే సంవత్సరంలో సీఎం రైతుల కోసం రూ.54 వేల 280 కోట్లు వ్యయం చేశారని గుర్తుచేశారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం రూ.10 వేల, 547 కోట్లు కేటాయించిందని తెలిపారు. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా రైతుల కోసం ఇంతలా పనిచేసే ప్రభుత్వం లేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలో పడేశారని.. చేసిన అప్పులకు వడ్డీ కడుతూనే అభివృద్ధికి సీఎం శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాటలతో వెళ్లదీయగా కాంగ్రెస్ చేతలతో సమాధానం చెబుతుందని అన్నారు. డిసెంబర్ 9 వరకు రుణమాఫీ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. రైతుభరోసా తప్పని సరిగ్గా వస్తుందని, రైతులు అధైర్య పడవద్దని సూచించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశయం మేరకు ప్రాణహిత – చేవెళ్ల, పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో జిల్లాకు సాగు, తాగునీటిని రప్పిస్తామని తెలిపారు. రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర వచ్చేలా మార్కెట్ కమిటీ కృషి చేయాలని సూచించారు. మార్కెట్ ప్రాంగణంలో సీసీ రోడ్డు, ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని అన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, పార్టీ జాతీయ యువజన ప్రధాన కార్యదర్శి సంతోష్, ధారూరు మండల అధ్యక్షుడు మాన్‌సింగ్, ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ కార్యదర్శి సిద్దమ్మ, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ బాబాఖాన్, బుజ్జయ్యగౌడ్ పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం

ధారూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా విజయభాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా అశోక్ ముదిరాజ్, డైరెక్టర్లుగా పటేల్ అమరేశ్వర్‌రావు, ఎన్.రవీందర్‌రెడ్డి, వరోత్య బాబునాయక్, మహ్మద్ శమీమ్ పాషా, ఎల్లంకొండి అంజయ్య, గాజుల వాణి, పి.ప్రతాప్, ఎం.జైపాల్, జోగు శోభ, కె.రవీందర్, టి.రమేశ్, బి.సాయన్న, పీఏసీఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్, తాండూరు ఏడీఏ, గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, స్పీకర్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

అనంతగిరి: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం వికారాబాద్‌లోని క్లబ్ ఫంక్షన్ హాల్ ఆవరణలో లయన్స్ క్లబ్ – వికారాబాద్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్పీకర్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. వికారాబాద్‌లో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. రాజకీయాల కంటే ముందు తాను సేవా కార్యక్రమాలు చేపట్టానని గుర్తు చేశారు. మా కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం గ్యాక్ పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి పేదలకు అవసరమైన వారికి సహాయం అందిస్తున్నానని తెలిపారు. పరిసర గ్రామాలలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేస్తే ట్రస్ట్ తరఫున సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, డీఎంహెచ్‌ఓ వెంకటరవణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, క్లబ్ ప్రతినిధులు నర్సింలు, నర్సింహారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, ఎండీ హాఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

టీకాలపై ప్రత్యేక శ్రద్ధ వహించండి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటరవణ

డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరవణ

అనంతగిరి: ఇమ్యునైజేషన్ కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరవణ ఆదేశించారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పీహెచ్‌సీల వైద్యులు, పర్యవేక్షకులకు సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాలపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది, పర్యవేక్షకులు వారివారి పరిధిలో ఉన్న చిన్నారుల సంఖ్యను మదింపు చేసుకొని టీకాలు వేయాలన్నారు. అనంతరం యూనిసెఫ్ కన్సల్టెంట్ డాక్టర్ మురారి, యూఎన్‌డీపీ కన్సల్టెంట్ డాక్టర్ జోష్ణ మాట్లాడారు. ఏడాది లోపు చిన్నారులకు టీకాలు వేయడమే కాకుండా 18నెలలు, 5, 10, 16 సంవత్సరాల వయస్సులో బూస్టర్ డోసులు కూడా వేయాలన్నారు. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. టీకా వేసిన తర్వాత పిల్లల్లో సమస్యలు తలెత్తితే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాక్సినేషన్ తర్వాత సిరంజీలను భద్రపరిచి నిర్మూలించాలని ఆదేశించారు. టీకాలు తీసుకోని చిన్నారులను గుర్తించడం కోసం ఇంటింటి సర్వే చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బుచ్చిబాబు, డిప్యూటీ డెమో వి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దామగుండంలో గస్తీ పెంచండి

చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆఫీసర్ ప్రియాంక వర్గీస్



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ప్రియాంక వర్గీస్

పూడూరు: దామగుండం అటవీ ప్రాంతాన్ని శనివారం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆఫీసర్ ప్రియాంక వర్గీస్ సందర్శించారు. రెండు రోజుల క్రితం అడవిలో జరిగిన అగ్ని ప్రమాదానికి సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. ఘటనలో ఏవైనా భారీ వృక్షాలు కాలిపోయా? అని తెలుసుకున్నారు. దామగుండంలో నేవీ ప్రాజెక్టు నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో వీటిని అడ్డుకునేందుకు ఎవరైనా ప్రయత్నిస్తున్నారా..? అనే విషయాలపై నేవీ అధికారులతో చర్చించారు. అడవికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించి, చుట్టుపక్కల చేపడుతున్న పనులను పరిశీలించారు. అటవీ ప్రాంతాన్ని రక్షించే బాధ్యత తీసుకోవాలని ఫారెస్ట్, నేవీ అధికారులను ఆదేశించారు. దామగుండంలో గస్తీ పెంచాలని, ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని అడవిని కాపాలడాలని సూచించారు. ఇదిలా ఉండగా మానవ తప్పిదంతోనే ప్రమాదం జరిగినట్లు ఫారెస్ట్ అధికారులు ఆమెకు తెలియజేశారు. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా చూసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్, ఎఫ్‌ఆర్‌ఓ శ్యాంకుమార్, సెక్షన్ ఆఫీసర్ అరుణ, నేవీ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

యాలాల: మండల పరిధిలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, నూతన పనులకు శంకుస్థాపనలు చేసేందుకు ఆదివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి విచ్చేయనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండలానికి మంజూరైన రూ.2.75 కోట్ల పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు కోకట్‌లో సీసీరోడ్డు ప్రారంభించిన అనంతరం రాఘవపూర్, కమాల్‌పూర్, నాగసమందర్, అన్నసాగర్, బాణాపూర్, అడాల్‌పూర్, రాస్నం, గంగాసాగర్, పగిడియాల, బాగాయిపల్లి, అచ్యుతాపూర్, ముద్దాయిపేట గ్రామాల్లో పర్యటించనున్నారని తెలిపారు. అధికారులు, నాయకులు సకాలంలో హాజరై కార్యక్రమానికి విజయవంతం చేయాలని కోరారు.

ఒకటో తారీఖున పెన్షన్లు ఇవ్వాలి

దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్



భిక్షాటన చేస్తున్న దివ్యాంగులు

అనంతగిరి: ప్రభుత్వం ప్రతీనెల ఒకటో తారీఖున పెన్షన్లు ఇవ్వాలని దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ డిమాండ్ చేశారు. శనివారం వికారాబాద్‌లోని రైల్వే స్టేషన్ సమీపంలో భిక్షాటన చేపట్టి ప్రభుత్వానికి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ.. పెన్షన్లు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సుధీర్, బాలరాజు, గణేష్, చంద్రయ్య, సుక్కయ్య, రవీందర్ పాల్గొన్నారు.

వెంచర్ రోడ్డు తవ్విన వ్యక్తిపై కేసు

నందిగామ: వెంచర్‌లో తన భూమి ఉందని ఆ వెంచర్ రోడ్డును తవ్వి అడ్డుగా ప్రీకాస్ట్ ప్రహరీ నిర్మిస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదైంది. నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. నందిగామ శివారు పిత్తి ల్యామినేషన్ పరిశ్రమ వెనకాల, వీర్లపల్లికి వెళ్లే రోడ్డును ఆనుకుని 15 ఏళ్ల క్రితం స్వాతి వేణుగోపాల్ నగర్ అనే పేరుతో ఓ వెంచర్‌ను వేశారు. మోహన్ సింగ్ అనే వ్యక్తి తన భూమి వెంచర్‌లో ఉందని శనివారం వెంచర్ రోడ్డును తవ్వి రోడ్డుకు అడ్డంగా ప్రీ కాస్ట్ వేస్తూ తమ ప్లాట్లను ఆక్రమించుకుంటున్నాడని ప్లాట్ల యాజమానులు శనివారం ఆందోళన చేపట్టారు. ప్లాటు యాజమాని సెట్టిపల్లి వైష్ణవి ఫిర్యాదు మేరకు మోహన్ సింగ్‌పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. ఇద్దరి మృతి



సోమమ్మ మృతదేహం

కొత్తూరు: ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో ఓ మహిళతో పాటు ఐదేళ్ల చిన్నారి మృతి చెందింది. ఈ దుర్ఘటన మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్ తిమ్మాపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని రెడ్డిపాలెం గ్రామంలో వ్యవసాయ కూలీ పనులు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్‌కు చెందిన పలువురు కూలీలు రైలులో తిమ్మాపూర్‌కు చేరుకున్నారు. వారిని రెడ్డిపాలెం తీసుకెళ్లేందుకు ఓ వ్యక్తి ట్రాక్టర్‌తో గ్రామానికి బయలుదేరాడు. కాగా మార్గ మధ్యలో ట్రాక్టర్ అకస్మాత్తుగా బోల్తాపడింది. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న కర్నూల్‌కు చెందిన సోమమ్మ(55), మమత(05) అక్కడికక్కడే మృతి చెందారు. క్షతగాత్రులను స్థానికులు షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



నక్కర్తమేడిపల్లి-నానక్‌నగర్ మధ్య ఫార్మాసిటీకి సేకరించిన పట్టాభూమి

ఫార్మాసిటీ రద్దుకు మరో పోరాటం

- నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తిలో.. లగచర్ల ఫార్మా రద్దు ఎఫెక్ట్
- భూములను తమ పేరున మార్చాలని రైతుల డిమాండ్
- అథారిటీలో డబ్బులు జమ చేసిన 2,211 ఎకరాలు ఇచ్చేందుకు బాధితుల ససేమిరా
- టీజీఐఐసీకి అప్పగించబోమని వెల్లడి

యాచారం: ఫార్మాసిటీకి ప్రభుత్వం సేకరించిన పట్టా భూములను వెనక్కి ఇచ్చేలా రైతులు మరో పోరాటానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అన్నదాతల ఆందోళనలతో తాజాగా సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజవర్గమైన కొడంగల్‌లోని లగచర్లలో ఏర్పాటు చేయతలపెట్టిన ఫార్మావిలేజ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. గత బీఆర్‌ఎస్ సర్కార్ యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల పరిధిలోని పది గ్రామాల్లో ఫార్మాసిటీకి 19,333 ఎకరాల పట్టా, అసైన్డ్ భూములను సేకరించడానికి నిర్ణయించింది తెలిసిందే. ఇందులో భాగంగానే యాచారం మండలంలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల్లో 9,851 ఎకరాల పట్టా, అసైన్డ్ భూముల సేకరణకు సంకల్పించింది. మొదట్లో పట్టా భూములకు ఎకరాకు రూ.12.50 లక్షలు (తర్వాత రూ.16 లక్షలు, రూ.25 లక్షలకు పెంచారు), అసైన్డ్ భూమి ఎకరాకు రూ.8 లక్షలు, ప్రభుత్వ భూమిలో కబ్జాలో ఉన్న రైతులకు రూ.7.70 లక్షల పరిహారం అందజేసింది. ప్రారంభంలో 7,640 ఎకరాల పట్టా, అసైన్డ్ భూముల సేకరణలో ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదు. కందుకూరు మండలంలోని పలు గ్రామాల్లో అసైన్డ్, పట్టా భూముల సేకరణ కూడా సజావుగా సాగింది.

రైతులపై ఒత్తిళ్లతో పోరాటం

నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల్లో ఏడాదికి మూడు పంటలు పండే పట్టా భూముల సేకరణకు వచ్చే సరికి రైతుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. ఆయా గ్రామాల్లోని బాధితులు ఫార్మాసిటీకి పట్టా భూములు ఇచ్చేది లేదని, పట్టా భూములకు (ఎకరాకు) ఇచ్చే రూ.12.50 లక్షల పరిహారంతో 70 కిలోమీటర్ల దూరం వెళ్లినా భూమి దొరకడం లేదని మొండికేశారు. ఎకరాకు రూ.50 లక్షల పరిహారం ఇస్తే ఇష్టమున్న వారు పట్టా భూములు ఇస్తారని, లేదంటే బలవంతం చేయొద్దని తేల్చి చెప్పారు. టీఎస్‌ఐఐసీ, రెవెన్యూ అధికారుల ఒత్తిళ్లను తట్టుకోలేక బలవంతంగా భూములు తీసుకుంటున్నారని పలువురు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలోనే అప్పటి అధికారులు రాత్రికిరాత్రే నాలుగు గ్రామాల్లో 1,200 మంది రైతులకు చెందిన 2,211 ఎకరాల పట్టా భూములకు సంబంధించి అవార్డు పాస్ చేశారు. ఎకరాకు రూ.12.50 లక్షల పరిహారం తీసుకోవాలన్నారు. రైతుల నుంచి స్పందన లేకపోవడంతో పరిహారం డబ్బులు అథారిటీలో జమ చేసి రైతుల పేర్లతో ఉన్న పట్టా భూముల రికార్డులను టీఎస్‌ఐఐసీ పేరు మీద మార్చేశారు.

ఇక్కడి పోరాట స్ఫూర్తితోనే ..

ఫార్మాసిటీకి వ్యతిరేకంగా ఇక్కడి పట్టా రైతులు చేపట్టిన పోరాటాన్ని తెలుసుకునేందుకు కొద్ది నెలల క్రితం లగచర్ల, దుద్యాల తదితర గ్రామాలకు చెందిన ఫార్మా బాధిత రైతులు యాచారం మండలంలో పర్యటించారు. ఫార్మాసిటీకి వ్యతిరేకంగా చేసిన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని.. ఉద్యమం ప్రారంభించారు. తాజాగా లగచర్లలో చేపట్టే ఫార్మా విలేజ్ భూ సేకరణను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అక్కడి రైతుల పోరాట స్ఫూర్తిని తీసుకుంటున్న యాచారం మండల రైతుల అంగీకారం లేకుండానే ఫార్మాసిటీకి తీసుకున్న 2,211 ఎకరాల పట్టా భూముల సేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఫార్మాసిటీని రద్దు చేస్తామని, బీఆర్‌ఎస్ సర్కార్ బలవంతంగా సేకరించిన పట్టా భూములను తిరిగి రైతులకే చెందేలా కృషి చేస్తామని కాంగ్రెస్ పెద్దలు హామీ ఇచ్చారు. టీఎస్‌ఐఐసీ పేరు మీద నమోదు చేసి పట్టా భూముల రికార్డులను మళ్లీ రైతుల పేర్లపై నమోదయ్యేలా కృషి చేస్తామన్నారు. ఆ హామీ మేరకు 2,211 ఎకరాల పట్టా భూములకు సంబంధించి నోటిఫికేషన్ రద్దు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. లేని పక్షంలో మరో పోరాటానికి సిద్ధం అంటున్నారు. ఈ మేరకు నాలుగు గ్రామాల రైతులు కొత్త కమిటీని సైతం ప్రకటించుకున్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పెద్దలు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. ఫార్మాసిటీని రద్దు చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ సర్కార్ బలవంతంగా సేకరించిన పట్టా భూములను తిరిగి ఇచ్చేస్తామన్నారు. లగచర్లలో భూ సేకరణపై ప్రభుత్వం వెనక్కి తగ్గిన నేపథ్యంలో ఇక్కడి రైతులు కూడా మరో పోరాటానికి సిద్ధమవుతున్నారు.

– కవుల సరస్వతి, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సమన్వయకర్త

ఆర్టీసీ ప్రైవేటు డ్రైవర్ల నిరసన

- దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలకు డిమాండ్
- పరిగిలో నిలిచిపోయిన బస్సులు
- ఇబ్బందులు పడిన ప్రయాణికులు



గాయపడిన డ్రైవర్ శివప్రసాద్

పరిగి: ఆర్టీసీ ప్రైవేటు డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని శనివారం ప్రైవేటు డ్రైవర్లు నిరసనకు దిగారు. ఈనెల 29న పరిగి నుంచి షాద్‌నగర్ వెళ్లిన ప్రైవేటు ఆర్టీసీ బస్సు తిరిగి పరిగికి వస్తుండగా రామచంద్రాపురం వద్ద ఓ ప్రయాణికుడు బస్సు ఆపమని చెయ్యి ఎత్తడంతో ముందుకు వెళ్లి బస్సు ఆపాడు. దీంతో డ్రైవర్ శివప్రసాద్, ప్రయాణికుడు నవీన్‌కుమార్ మధ్య మాటలు పెరిగాయి. ఇంతటితో ఆగకుండా ప్రయాణికుడు డ్రైవర్‌పై ముఖంపై పిడిగుద్దులతో దాడికి చేశాడు. దీంతో డ్రైవర్ కన్నుకు, ముఖంపై గాయాలయ్యాయి. దీంతో డ్రైవర్ డీఎం కరుణశ్రీకి సమాచారం అందించడంతో కొందుర్గు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. శనివారం ఉదయం ఆర్టీసీ అధికారులు తమను పట్టించుకోవడం లేదని ఆర్టీసీ ప్రైవేటు డ్రైవర్లు నిరసనకు దిగారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్‌లో సరిపడా బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 38 ప్రైవేటు బస్సులు బస్టాండ్‌కే పరిమితమవ్వడంతో పలు గ్రామాల నుంచి కళాశాలలకు, పాఠశాలలకు వచ్చే విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు చవిచూశారు. బస్టాండ్ ప్రాంగణం ప్రయాణికులతో కిక్కిరిసింది. ఓ వైపు రైతు సదస్సుకు బస్సులు.. మరో వైపు ప్రైవేట్ డ్రైవర్ల నిరసనతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న డీఎం ప్రైవేటు డ్రైవర్లతో మాట్లాడి వారి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో 11గంటలకు ప్రైవేటు బస్సులు బస్టాండ్ నుంచి వివిధ రూట్‌లకు కదిలాయి.



బస్టాండ్‌కే పరిమితమైన బస్సులు

పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానంద్‌గౌడ్

కొడంగల్ రూరల్: పీఆర్సీ అమలు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సదానందగౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఓ పాఠశాలలో ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సదానందగౌడ్ మాట్లడుతూ.. ఎస్ఎస్ఏ ఉద్యోగస్తులకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలని, పాతపెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డ్స్ ఇవ్వాలని కోరారు. మెడికల్ రియింబర్స్‌మెంట్ బిల్లులను ఆన్‌లైన్ విధానం ద్వారా చెల్లించాలని, మధ్యాహ్న భోజన పథకంలో హెచ్‌ఎంలకు, ఇంచార్జ్ ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం సరికాదన్నారు. సమగ్ర కుల గణన సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లకు పారితోషికం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 317జీఓ ద్వారా నష్టపోయిన ఉద్యోగ ఉపాధ్యాయ బాధితులను సొంత జిల్లాలకు పోయే విదంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.షఫీ, రాష్ట్ర ఆర్థిక కార్యవర్గ సభ్యులు పవన్ కుమార్ వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సదానంద్‌గౌడ్

వినోదంతో కూడిన విద్యతోనే ఫలితాలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కరీం

సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ కరీం

తాండూరు టౌన్: వినోదంతో కూడిన విద్యతోనే మెరుగైన ఫలితాలు వస్తాయని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎంఏ కరీం అన్నారు. శనివారం స్థానిక తులసీగార్డెన్‌లో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు మానసిక సామర్థ్య స్థాయిని పెంచేందుకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కరీం మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టపడి చదివేలా ప్రోత్సహించాలన్నారు. నేటి తరం విద్యార్థులు స్మార్ట్ ఫోన్స్, ఆన్‌లైన్ గేమ్స్ వాటిపైనే ఎక్కువ శ్రద్ధ కనబరుస్తున్నారని చెప్పారు. స్మార్ట్ ఫోన్ వాడకడంతో చదువుపై ఆసక్తి తగ్గిపోతోందన్నారు. వారికి వినోదంతో కూడిన విద్య అందిస్తేనే అనుకున్న ఫలితాలు రాబట్టవచ్చన్నారు. విద్యార్థుల్లో మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించేందుకు షార్ప్ గేమ్స్‌తో పాటు, మైదాన ఆటలను అలవాటు చేయాలన్నారు. దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించి, భవిష్యత్‌లో వారి నైపుణ్యాన్ని వినియోగించేలా చిన్ననాటి నుంచే తర్ఫీదు ఇవ్వాలన్నారు. అనంతరం మెమొరీ కాంటెస్ట్ నిర్వహించి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అభ్యసనా వైకల్యాలు ఉన్న వారు 040–35717915, 9440488571 నంబర్‌లలో సంప్రదించాలన్నారు. అనంతరం మెజీషియన్ రామకృష్ణ ఇంద్రజాల ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో అక్షర, వేదిక్ విశిష్ట, నేషనల్, శివం, హంసవాహిని, ఐడియల్ పాఠశాలల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు.

కలప తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

యాలాల: ఎలాంటి అనుమతులు లేకుండా కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ గిరి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గోరేపల్లి గేటు సమీపంలో శుక్రవారం రాత్రి కలప లోడ్‌తో తాండూరు వైపు వెళ్తున్న ఓ ట్రాక్టరును తనిఖీ చేశారు. కలప రవాణాకు సంబంధించి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో వాహనాన్ని ఠాణాకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రయాణికురాలి బ్యాగులోంచి నగలు చోరీ

మొయినాబాద్: ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన మహిళ బ్యాగులోంచి బంగారు నగలు చోరీకి గురయ్యాయి. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ రెడ్డి తెలిపిన ప్రకారం.. మొయినాబాద్‌కు చెందిన బండి రమ్యశ్రీ నవంబర్ 27న సాయంత్రం 4.20గంటలకు చేవెళ్ల నుంచి మొయినాబాద్‌కు ఆర్టీసీ బస్సులో వచ్చింది. బస్సుదిగి ఇంటికి చేరుకుని బ్యాగును చూసుకోగా బ్యాగులో ఉన్న రెండు తులాల బంగారు నల్లపూసల దండ, తులం బంగారు చెవి కమ్మలు, రెండు బంగారు ఉంగరాలు కనిపించలేదు. ఈ విషయమై శనివారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కంప్యూటరీకరణలో తప్పులుండొద్దు

అదనపు కలెక్టర్ సుధీర్

తాండూరు: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీని వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన తాండూరు మున్సిపల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. కుటుంబ సర్వే డేటాఎంత శాతం పూర్తి చేశారని కమిషనర్ విక్రం సంహారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో డేటా ఎంట్రీ చేస్తున్న సిబ్బందితో మాట్లాడారు. తప్పులు లేకుండా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్, కమిషనర్ విక్రంసింహారెడ్డితో కలిసి పరిశీలించారు.

వేగవంతంగా పూర్తి చేయాలి

యాలాల: సమగ్ర కుటుంబ సర్వే వివరాల కంప్యూటరీకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సుధీర్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో చేపట్టిన డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఈ ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. అంతకు ముందు ఆయన జుంటుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులకు సకాలంలో చెల్లింపులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ పుష్పలీల, ఎంపీఓ యాదయ్య తదితరులు ఉన్నారు.



తాండూరు: మున్సిపల్ కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

నాణ్యమైన భోజనం వడ్డించాలి

మొయినాబాద్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్న అన్నారు. మండల పరిధిలోని చిలుకూరులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, శంకర్‌పల్లి గురుకుల పాఠశాలను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెడుతున్నారా.. లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కిచెన్ షెడ్లు, స్టోర్ రూంలు, పరిసరాలను పరిశీలించారు. భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడి ఎలా ఉందని ఆరా తీశారు. కిచన్ షెడ్, వంట పాత్రలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు పెట్టే భోజనంలో నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట రంగారెడ్డి డీఈఓ సుశీంధర్‌రావు, డీఐఈఓ వెంక్యానాయక్ తదితరులు ఉన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు


ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు

యాచారం: బైక్‌ను కారు ఢీకొట్టడంతో ద్విచక్రవాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన యాచారం ఠాణా పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని నందివనపర్తి గ్రామానికి చెందిన మోతీలాల్ బైక్‌పై మాల్‌మార్కెట్ వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో తక్కళ్లపల్లి గేట్ వద్ద యాచారం నుంచి మాల్‌వైపు వేగంగా ప్రయాణిస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో మోతీలాల్ తీవ్రంగా గాయపడడంతో ఆయన్ను చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి

మంచాల: రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం ఆయన ఆరుట్ల గ్రామంలోని శ్రీ బుగ్గ రామలింగేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఆయన మాట్లాడుతూ.. చారిత్రాత్మక ఆలయాలను కాపాడుకోవాలన్నారు. ఆలయాలు మన చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయాలని చెప్పారు. హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు పొందాల జంగయ్య గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సంఘం సభ్యులు బోసుపల్లి ప్రతాప్, వింజమూరి వెంకట్‌రెడ్డి, నాయకులు భాషయ్య, కొంగర వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, శ్రీశైలం, సుదర్శన్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నూకం రాజు, రమేష్, రవీందర్‌రెడ్డి, భిక్షపతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి ప్రత్యేక పూజలు

మొక్కులు తీర్చుకున్న దండెం రాంరెడ్డి

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు దండెం రాంరెడ్డి శనివారం బుగ్గరామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. రామలింగేశ్వరుడి ప్రత్యేక అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అనిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, హతిరాం, రాహుల్, అక్షయ్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజు గౌడ్, చక్రపాణి, శేఖర్ చారి, సందీప్, కిట్టు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యాలే టార్గెట్

- ఫంక్షన్ హాళ్లలో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా
- మధ్యప్రదేశ్‌లో తలదాచుకున్న దుండగులు
- ఇద్దరి అరెస్ట్.. పరారీలో మరో ఇద్దరు అన్నదమ్ములు
- అరెస్టయిన వారిలో ఒక మైనర్
- 38 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన డీసీపీ సునీతారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఫంక్షన్ హాళ్లలో నిర్వహించే శుభకార్యాలు, వివాహాలను లక్ష్యంగా దోపీడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను ఆదిబట్ల పోలీసులు అరెస్ట్ చేశారని మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆమె శనివారం కేసు వివరాలు వెల్లడించారు. నవంబర్ 14న కర్మన్‌ఘాట్ ప్రాంతానికి చెందిన వ్యాపారి పారుపల్లి నర్సింహ కుమార్తె వివాహం ఆదిబట్ల పీఎస్ పరిధి బ్రాహ్మణపల్లిలో ఉన్న ట్రాన్‌క్విల్ రిసార్ట్‌లో నిర్వహించారు. ఓ వైపు వివాహ వేడుకలు జరుగుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు స్టేజీ మీదకు వచ్చి ఫిర్యాదు దారుడి భార్య హ్యాండ్‌బ్యాగ్ ఎత్తుకెళ్లారు. బ్యాగులో ఉన్న రూ.40వేల నగదు, 18 తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కుటుంబ సభ్యులే ముఠాగా..

మధ్యప్రదేశ్ రాష్ట్రగం రాజ్‌ఘడ్ జిల్లాకు చెందిన అరుడ (38), రిషి (19), అభిషేక్ (25)తో పాటు 12 ఏళ్ల బాల నేరస్తుడు కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. గతంలో రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో చోరీలు చేసి జైలు జీవితం గడిపారు. అనంతరం ఫంక్షన్‌హాల్స్‌లో శుభకార్యాలే లక్ష్యంగా చోరీలు చేసేందుకు నిర్ణయించుకున్నారు. ఫంక్షన్‌కు వెళ్లి అదును చూసి మహిళలు హ్యాండ్‌బ్యాగులను కొట్టేస్తారు. ఈ క్రమంలో ముఠా సభ్యుడు అభిషేక్ అత్త భల్లుబాయి కారును కిరాయి తీసుకుని నవంబర్ 10న మధ్యప్రదేశ్ నుంచి బయలుదేరి 12న హైదరాబాద్ చేరుకున్నారు. విజయవాడ, సాగర్ హైవేలలో ఫంక్షన్ హాల్స్‌లో చోరీకి యత్నించారు. నవంబర్ 14న ట్రాన్‌క్విల్ రిసార్ట్‌లో వివాహం ఉన్నట్లు ఎల్‌బీనగర్‌లో కట్టిన బ్యానర్ గమనించారు. అక్కడకు చేరకున్న ముఠా సభ్యుల్లో అభిషేక్ ఫంక్షన్ హాల్ బయట కారుతో సిద్ధంగా ఉండగా.. అరుడ, రిషి, బాలుడు రిసార్ట్‌కు వెళ్లారు. అరుడ, రిషి కాపలాగా ఉండగా బాలుడు సోఫాలో కూర్చుని ఫిర్యాదు దారుడి అత్త బ్యాగులోంచి నగలు తీయడం గమనించాడు. స్టేజీ మీదకు వెళ్లి ఆమె బ్యాగు పక్కకు పెట్టగానే దొంగిలించి అందులోని బంగారు నగలు, నగదు తీసుకుని సెల్‌ఫోన్ బ్యాగ్ పడేశారు. అనంతరం విజయవాడ హైవే మీదుగా పారిపోయారు. ఇదే తరహాలో కర్నాటక రాష్ట్రం తిప్తూర్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ చేసి తిరిగి నగరానికి చేరుకున్నారు. అరుడ, బాల నేరస్తుడిని పోలీసులు పట్టుకోగా మరో ఇద్దరు అన్నదమ్ములు రిషి, అభిషేక్‌లు కర్నాటకలో చోరీ చేసిన బంగారంతో పరారయ్యారు. వీరిపై రాజస్థాన్, మధ్యప్రదేశ్, తెలంగాణలో ఏడు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరి వద్ద 38 తులాల బంగారు అభరణాలు, కారు, అరుడ సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లి కేసును ఛేదించిన ఆదిబట్ల పోలీసులు సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్ఐ వెంకటేశ్, రాజు, హెడ్‌కానిస్టేబుల్ గిరి, ఉపేందర్ రెడ్డి, సంతోశ్, శివచంద్ర, కృష్ణ, రవీందర్, సందీప్‌ను డీసీపీ అభినందించారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి, సీఐ రాఘవేందర్‌రెడ్డి